सत्यं वद - धर्मं चर


శ్రీ ప్రణవపీఠం

ఏలూరు

# ప్రణవ పద్మాకరం

ప్రారంభ సంచిక

జనవరి, 2022



# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

జనవరి, 2022

## విషయ సూచిక

సంచిక-1
సంపుటి-1


| | | |
|---|---|---|
| సంపాదకీయం 1 | శ్రీ గణేశ పురాణం 2 | శ్రీ వేంకటేశ్వర రహస్యం 4 |
| బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీమతి పాలగుమ్మి (వద్దిపర్తి) శ్రీవిద్య | శ్రీమతి నడుముక్కల (వద్దిపర్తి) శ్రీకళ |
| ఋషిచరిత్ర 6 | ఐశ్వర్యయోగం 7 | పురాణంలో మహిళలు 8 |
| శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| స్తోత్రమాలిక 9 | సంక్రాంతి విశేషాలు 11 | సత్సంగ సమాచారము 18 |
| బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


**పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు గారికి జయము జయము**

శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యో నమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు ,శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు .


https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## సంపాదకీయం

### సత్యం వద-ధర్మం చర

ధర్మం నాలుగుపాదాల నడచిన భూమి, నేడు అధర్మానికి నిలయమైపోతోంది. వేదపురాణేతిహాసాలను పాడుచేయడానికి రాక్షసశక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఇటువంటి సమయంలో ధర్మాసక్తి కలిగిన వారందరూ ఒక్కటై వారివారి శక్తిని అనుసరించి ధర్మాన్ని నిలబెట్టాలి. సత్యధర్మాలను ఆచరించేవారి కోసమే <u>ప్రణవపద్మాకరమనే</u> పత్రికను ప్రారంభించాము.

భగవంతుడిని ఆరాధించే విధానాలు, ధర్మసూక్ష్మాలు, ప్రతిజీవికి పరమాత్మను ఆరాధించే అవకాశం కలిగించడం, హైందవధర్మపరిరక్షణం, భగవంతునిపై భయమేకాక భక్తి, ఆత్మీయత పెంచడం వంటి అనేక అంశాలను ఈ పత్రిక ప్రజలకు అందిస్తుంది. సర్వజీవుల ఐకమత్యం ఈ ప్రణవపద్మాకరం లక్ష్యం.

ప్రణవపద్మాకరంలో అనేక వ్యాసపద్మాలు ఉంటాయి. అవన్నీ భక్తులనబడే తుమ్మెదలకు ధర్మ, అర్థ, కామ, మోక్షములనబడే మకరందాన్ని (తేనెను) పంచిపెడతాయి. సాధకులు త్రాగి తరించగలరు.

వద్దిపర్తి పద్మాకర్

# ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక


## శ్రీ గణేశ పురాణం




శ్లో॥ సుముఖశ్చైకదంతశ్చ , కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో, విఘ్నరాజో గణాధిపః
ధూమకేతుః గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండః శూర్పకర్ణః హేరంబః స్కందపూర్వజః
షోడశైతాని నామాని యః పఠేత్ శృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమే తథా
సంగ్రామే సర్వకార్యేషు విఘ్నః తస్య నజాయతే ॥

**విఘ్నేశ్వరునికి** అనంత నామాలున్నాయి. అనేక అవతారాలున్నాయి. ఆయన లీలా గాథలు కూడా అనంతాలే. విఘ్నేశ్వరుడు నిర్గుణుడూ, సగుణుడు కూడా. అటువంటి గణేశ్వరునికి బాగా ఇష్టమైన పదహారునామాలు ఉన్నాయని, ఆ పదహారు నామాలని భక్తితో తలచుకుంటే సకలశుభాలు కలుగుతాయని వ్యాసమహర్షి సెలవిచ్చాడు. ఈ పదహారు నామాలను ఉచ్చరించినా, విన్నా కూడా శుభాలే కలుగుతాయి. అందునా విద్యారంభ సమయంలోనూ, వివాహ సమయంలోనూ, ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు లేక గృహాదులలో ప్రవేశిస్తున్నప్పుడూ, యుద్ధసమయంలోనూ, ఇంకా సర్వకార్యాలలోనూ ఈ నామాలు ఉచ్చరించినవానికి, విన్నవానికి విఘ్నాలు తొలగిపోతాయి. ఆ నామములను గురించి విడివిడిగా తెలుసుకుందాం.

### విఘ్నేశ్వరుని పదహారునామాలు:

| | |
|---|---|
| 1. సుముఖుడు | 9. ధూమకేతుడు |
| 2. ఏకదంతుడు | 10. గణాధ్యక్షుడు |
| 3. కపిలుడు | 11. ఫాలచంద్రుడు |
| 4. గజకర్ణకుడు | 12. గజాననుడు |
| 5. లంబోదరుడు | 13. వక్రతుండుడు |
| 6. వికటుడు | 14. శూర్పకర్ణుడు |
| 7. విఘ్నరాజు | 15. హేరంబుడు |
| 8. గణాధిపుడు | 16. స్కందపూర్వజుడు |

ఇందులో ఒక్కొక్క నామానికి గల విశేషార్థాలను, వ్యుత్పత్తులను గురించి కూడా తెలుసుకుందాం.

### (1) సుముఖుడు

మొదటి నామం సుముఖుడు. 'సు' అనగా మంచి లేక అందమైన. అందమైనముఖము లేక పవిత్రమైనముఖము కలిగిన వాడిని సుముఖుడు అంటారు. దంతములతో, చిన్నకళ్ళతో, చేటలవంటి చెవులతో, ఏనుగుతొండంతో కూడి ఉన్నప్పటికీ గణేశుని ముఖాన్ని ఒక్కసారి చూసినవాడు ముగ్ధుడైపోతాడు. వేయికళ్ళు కల్గిన

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక


ఇంద్రుడు గణేశుని ముఖవర్చస్సును చూచి, 'ఈ వేయికళ్ళు సరిపోవు' అనుకున్నాడట! తెల్లరంగులో, కోటిసూర్యులకాంతితో, కోటిచంద్రుల చల్లదనంతో ఉండే గణేశుని ముఖం చూడగలిగే భాగ్యం అందరికీ దక్కదు. ఆయన రమణీయ రూపాన్ని చూచి, వారివారి సంస్కారాలను బట్టి కొందరు దైవంగా, కొందరు భర్తగా, కొందరు తండ్రిగా, కొందరు గురువుగా, కొందరు పుత్రునిగా పొందాలని కోరుకుంటుంటారు. ఆయన రూపం అంత రమణీయంగా ఉంటుంది.

శ్లో॥ క్షణే క్షణే యన్నవతాముపైతి, తదేవ రూపం
రమణీయతాయాః॥

**(మాఘుని శిశుపాలవధ కావ్యంలోని. అ.4.శ్లో.17)**

క్షణక్షణము కొత్తగా కన్పించే రూపాన్ని రమణీయత్వము అంటారు. ఎన్నిసార్లు చూసినా విఘ్నేశ్వరుని ముఖం ఎప్పటికప్పుడు కొత్త కొత్త అందాలతో శోభిల్లుతూంటుంది. అందుకే ఆయనను 'సుముఖుడు' అన్నారు. గణపతిసంభవఘట్టంలో వినాయకుని శరీరాన్ని శివుడు శూలంతో పొడవగానే ఏమి జరిగిందో ఈ క్రింది శ్లోకంలో వివరించారు.

శ్లో॥ తద్దేహస్థమహో దినేశ శకలాకారం భవన్నిర్యయౌ
వృత్తీ భూయ గతం శశాంకబలయే ప్రోత్ప్లుత్య మండూకవత్॥

**(గణపతి సంభవం. అ.4.శ్లో.84)**

శివుడు తన శూలంతో గణేశుని పొడవగానే, గణేశుని శరీరంలోని తేజస్సు సూర్యబింబంలోని ఒక ముక్కలాగా మారి, ఆయన శరీరం నుండి వెలువడి, అది గుండ్రంగా తయారయి, కప్పలాగా దూకుకుంటూ చంద్రమండలంలో కలిసిపోయింది. చంద్రుడు విరాట్పురుషుని మనస్సు అని వేదము చెపుతున్నది. అందుకే విఘ్నేశ్వరుడు పునర్జీవితుడయిన తరువాత ఆయన ముఖాన్ని చూచినవారికి చంద్రబింబాన్ని చూసిన అనుభూతి కలిగేది. అందువలననే ఆయనను సుముఖుడు అని దేవాదులు పిలిచారు. ఇక విఘ్నేశ్వరుడి వాక్కు సృష్టికి మూలమైన 'ప్రణవనాదమే'. చక్కని వాక్ చాతుర్యం కలిగిన వాడవడం వల్ల, చక్కని మధుర కంఠస్వరం కలిగిన వాడవడం వలన కూడా ఆయనను సుముఖుడు అన్నారు. మంచిపనులు చేసే వారికి ఆయన ఎప్పుడూ అండగా ఉంటాడు. కాబట్టి ఆయనను సుముఖుడు అన్నారు. ఒక్కసారి గణేశ్వరుని ఉపాసన చేయడం మొదలుపెడితే భక్తులు ఆయనను విడువలేరు. అందువలన కూడా ఆయనను సుముఖుడు అన్నారు. తన దివ్యమహిమలతో, భక్తులు తనను ఏ రూపంలో చూడాలని కోరుకుంటున్నారో గ్రహించి అటువంటి ముఖరూపాలతో దర్శనమిస్తాడు. కనుక ఆయనను సుముఖుడు అంటారు.

...ఇంకా ఉంది

******

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

# శ్రీ వేంకటేశ్వర రహస్యము



క॥ శ్రీకర! వేంకటగిరి శో
భాకర! శ్రీ శ్రీకరీశుభాకర! శ్రుతి వి
ద్యాకర! శాశ్వత ధర్మ చి
దాకారా! వేంకటేశ్వరా! వేలనతుల్ ॥

మ॥ నిరతమ్ముగ్ జనకుండు, సద్గురుడు, మన్నింపంగ, నా తల్లి న
న్నరయన్, సర్వశుభాస్పదంబయిన, సర్వైశ్వర్య కైవల్య సు
స్థిర శైలాధిపుడైన శ్రీహరిని, భక్తిం గొల్చి, శ్రీవేంకటే
శ్వర చారిత్ర రహస్యమున్, శుభదమున్ వ్రాయంగ నేఁబూనితిన్ ॥

క॥ ఆశీర్వదించి, సప్తగి
రీశా! నాగ్రంథరచనకీగదవె! మనీ
షాశక్తిని, శ్రీకరియే
శ్రీకరుడని మదినెఱుంగ జేయవె ! తండ్రీ! ॥

పూర్వజన్మ సుకృతం వల్ల శ్రీవేంకటేశ్వర విలాసాన్ని లోకానికి సులభశైలిలో అందించిన పరమాత్మ స్వరూపుడు, సమర్థగురుడు, త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి అయిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు నాకు జనకులయ్యారు. తల్లి శ్రీమతి రంగవేణి కూడా వేంకటేశ్వర భక్తురాలే. అందుకే శ్రీవేంకటేశ్వరుని లీలా రహస్యాలు వ్రాసే భాగ్యం నాకు కలిగింది. సప్తగిరులు అనేక దివ్యరహస్యాలకు నిలయాలు. యుగయుగాలుగా బ్రహ్మర్షులు, దివ్యర్షులు, మహర్షులు, రాజర్షులు, ఋషులు, మునులు, సాధకులు, యోగులు ఈ కొండపై సాధనలు చేస్తూనే ఉన్నారు. ఆ సాధనలన్నీ రహస్యాలే. కొండలలోని గుహలు రహస్యాలే. జలపాతాలు రహస్యాలే. వృక్షాలు, జంతువులు, కీటాలు, ఇంతెందుకు ఈ కొండలోని అణువులన్నీ రహస్యాలే. ఆ రహస్యాలలో భగవంతుడు అందించిన మేరకు కొన్ని భక్తులకు అందించే ప్రయత్నం చేస్తాను. యుగాలు మారినప్పడల్లా ఆ పర్వతాలు అనేక విధాలుగా మార్పులు పొందుతాయి. వేంకటాద్రి ఒక్కొక్కసారి శ్రీనివాసునిలా కనపడుతుంటుంది. ఒక్కొక్కప్పుడు మేరుపర్వతం లాగా కనపడుతుంది.

ఒక్కొక్కప్పుడు మహామణిలాగా, ఒకప్పుడు ఆభరణంలాగా కనపడుతుంటుంది. కలియుగప్రజలకు మాత్రం రాళ్ళతో నిండిన కొండలాగా కనపడుతుంది. కారణం కలిలో ప్రజలు సుఖలాలసులు, ధనలాలసులు. ముఖ్యంగా గురువుల దగ్గరకు భక్తితో చేరి వారికి ద్రోహం తలపెట్టే గురుద్రోహులు కలియుగమానవులు. ఈ యుగంలో ఈ పర్వతం సువర్ణమణిమాణిక్యాదులుగా కనపడితే, పర్వతాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తుంటారు. దాని వలన సర్వనాశనం పొంది, నరకంలో పడతారు. అందువల్లనే శ్రీహరి కలియుగవాసులకు కేవలం పాషాణమయంగా మాత్రమే వేంకటాద్రిదర్శనం ఇచ్చేలాగా చేసాడు. అయినప్పటికీ పరమసాధకులు, సద్గురుభక్తులు మాత్రం ఈ కొండను దర్శించుకొన్నప్పుడు, సాలగ్రామశిలను దర్శించిన అనుభూతిని పొందుతారు. వేంకటాద్రి మహిమను ఆదిశేషుడు కూడా సంపూర్ణంగా వర్ణించలేడు. ఇక తక్కిన వారి సంగతి చెప్పేదేమున్నది ? ఈ కొండపై సనకసనందనాదులు మహాతపస్సు చేస్తుంటారు. ఒకపుడు బ్రహ్మమానసపుత్రులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు, నలుగురూ వైకుంఠానికి విష్ణుదర్శనానికి వెళ్ళారు. వారు మహాయోగులు, పరమహంసలు. ఎప్పుడు చూసినా ఎనిమిది సంవత్సరాల బాలురవలె కనబడుతుంటారు. వారిని కాలం ఏమీ చేయలేదు. జరామరణాలకు వారు అతీతులు. అంతటి మహాత్ములైన ఆ నలుగురూ, ఎక్కడికైనా ఎప్పుడైనా వెళ్ళే శక్తిని సంపాదించారు. వారిని ఎవ్వరూ అడ్డగించరాదని త్రిమూర్తులు శాసించారు. కానీ కాలప్రభావం వల్ల ఆ నలుగురినీ, విష్ణుదర్శనానికి వెడుతుండగా వైకుంఠ ద్వారపాలకులు అడ్డగించారు. దానితో సనకాదులు ఆగ్రహించారు. "శ్రీహరి వద్దకు వచ్చేవారు సామాన్యులా? ఎంత శక్తి లేకపోతే వైకుంఠం వరకూ రాగలరు? ఈ మాత్రం మీకు తెలియదా? యోగులను హరి దర్శనానికి వెళ్ళకుండా అడ్డుకున్న మీరు రజోగుణప్రధానులు. కాబట్టి భూలోకంలో రాక్షసులై జన్మించండి" అని వారు జయవిజయులను శపించారు.

ఆ శాపం వల్ల జయవిజయులు
కృతయుగంలో:హిరణ్యాక్షహిరణ్యకశిపులుగా,
త్రేతాయుగంలో :రావణకుంభకర్ణులుగా,
ద్వాపరయుగంలో:శిశుపాలదంతవక్త్రులుగా జన్మించి, హరిచేతిలో మరణించి తిరిగి వైకుంఠానికి వెళ్ళారు. ఉద్రేకంతో ద్వారపాలకులను శపించడంతో సనకాదులు వైకుంఠప్రవేశార్హతను కోల్పోయారు. అందుకే శ్రీహరి వారిని లోనికి రానివ్వక, తానే బయటకువచ్చి వారికి దర్శనం ఇచ్చాడు. అది గ్రహించిన సనకాదులు, స్వామిని భక్తితో స్తుతించి, జయవిజయుల శాపాన్ని తొలగించి, తమ పాపానికి ప్రాయశ్చిత్తం విధించమని శ్రీమహావిష్ణువును వేడుకొన్నారు. అప్పుడు శ్రీహరి వారితో ఇలా అన్నాడు — "మహామునులారా! మీకు అపచారం చేసిన జయవిజయులు శాపాన్ని అనుభవించాకే వైకుంఠం చేరుకొంటారు. ఆ విషయంలో నేను జోక్యం చేసుకోను. మీరు కోపం వల్ల వైకుంఠంలోనికి అడుగుపెట్టే అర్హతను కోల్పోయారు. తిరిగి ఈ లోకంలోనికి రావాలంటే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. వైకుంఠంలోని సప్తగిరులు, నా వరాహావతార కాలంలో భూలోకంలోనికి చేరుకొంటాయి. ఆ కొండలపై వరాహరూపంలో నేను అడుగుపెడతాను. వేంకటాద్రి వైకుంఠంతో సమానమైనది. అక్కడి రహస్యగుహలలో మీరు నలుగురూ నా గురించి తపస్సు చేయండి. ఆ తపస్సు వల్ల మీ దోషం తొలగిపోతుంది. మీకు వైకుంఠ ప్రవేశార్హత లభిస్తుంది."

...ఇంకా ఉంది

******

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

# ఋషి చరిత్ర

## శ్రీ శ్రీల ఏ. సి.భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు

పూర్తి పేరు: అభయ్ చరణారవింద

ఇతర పేర్లు : శ్రీల ప్రభుపాద, అభయ చరణ్ దే

జననము : 1896 సెప్టెంబరు 1 న

నగరం: కలకత్తా

మరణము: నవంబరు 14, 1977 న ఉత్తరప్రదేశ్ లోని వృందావనంలో మరణించారు

వారి గురుదేవులు: శ్రీ భక్తి సిద్ధాంత సరస్వతీ

**స్వామి ప్రభుపాదుల వారు** 1922 సంవత్సరం శ్రీ భక్తి సిద్ధాంత సరస్వతి గోస్వాముల వారిని కలకత్తాలో మొదటిసారి కలుసుకున్నారు. శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ గోస్వామి వారు ప్రముఖ వైదిక విద్వాంసులు, 64 గౌడీయ మఠాలను స్థాపించారు. వారు యువకులైన ప్రభుపాదులవారిని చూచి సంతోషముతో వైదిక విజ్ఞానాన్ని బోధించడానికి వారి జీవితాన్ని అంకితం చేయమని ఉపదేశించారు. ఆనాటినుండి శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ గోస్వామి వారికి శిష్యులై పదకొండు సంవత్సరాల తరువాత యథావిధిగా 1950లో దీక్షను తీసుకున్నారు. తొలి సమాగమనములోనే శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూరు గారు ఆంగ్లభాష ద్వారా వైదిక విజ్ఞానాన్ని ప్రచారము చేయమని శ్రీల ప్రభుపాదుల వారిని కోరారు. తరువాతి కాలంలో శ్రీల ప్రభుపాదులవారు భగవద్గీతకు భాష్యం వ్రాసి, గౌడీయమఠ కార్యక్రమాలకు తోడ్పడ్డారు. 1944లో బ్యాక్ టు గాడ్ హెడ్ అనే ఆంగ్ల పక్ష పత్రికను స్థాపించారు. అది ఇప్పుడు పాశ్చాత్యదేశాలలో వారి శిష్యుల చేత ముప్పయి కంటే ఎక్కువ భాషలలో కొనసాగించబడుతున్నది. శ్రీల ప్రభుపాదవారి భక్తి విజ్ఞానములను గుర్తించి 1947 సంవత్సరం లో గౌడియ వైష్ణవసంఘం స్వామి వారిని "భక్తివేదాంత" బిరుదుతో గౌరవించింది. ప్రభుపాదులవారు 1959 సంవత్సరం సన్యాసాశ్రమమును స్వీకరించారు. వారి గురుదేవుల ఆజ్ఞపై 1956 సంవత్సరంలో అమెరికా సంయుక్త రాష్ట్రములకు విచ్చేసారు. వారు వాణిజ్య నౌకలో మొదట న్యూయార్కు నగరమున కేగినపుడు వారి వద్ద ధనము ఏమాత్రమూ లేకుండెను. న్యూయార్కు నగరం ఇతరులతో ఒక ఇంటిలో ఉండేవారు. ఆ సమయంలో ఇతరుల వల్ల ప్రాణాపాయస్థితికి వెళ్లి శ్రీకృష్ణ కృప వలన బయటపడి, 1966వ సంవత్సరం జులైలో అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘమును స్థాపించారు. వారు ఎల్లప్పుడూ హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే|హరే రామ హరే రామ రామ రామ హరే హరే‖ అనే మహామహిమాన్విత మంత్రజపం చేస్తూ, చేయిస్తూ ఉండేవారు. ప్రభుపాదులవారి ముఖ్యాతిముఖ్యమైన సేవ గ్రంథరచన. దానిద్వారా ఆయన కీర్తి గడించారు. వారి గ్రంథాలు ప్రామాణికత్వానికీ, జ్ఞాన గాంభీర్యానికీ, వైదుష్యానికి నిదర్శనాలు. వారు శ్రీమద్భగవద్గీత మరియు శ్రీమద్భాగవతము ఆంగ్లములో అర్థ, తాత్పర్యములతో వ్రాసారు. దానిని వివిధ దేశ భాషల్లోకి అనువదించారు. గ్రంథరచనయే శ్రీల ప్రభుపాదులవారి ముఖ్యాతి ముఖ్యమైన సేవ. వీరు ప్రపంచమంతా 14 సార్లు ఉపన్యాస యాత్రలు సాగించారు, 6 ఖండముల యందు పర్యటించారు. మహఋషుల గురించి వ్రాయవలెనన్న కోరిక గలవారికి, శక్తిసామర్థ్యాలు శ్రీ గురుదేవుల నుండి అనుగ్రహం రూపంలో వర్షింపబడాలి. నేను జగదీష్ కోడె, వీరి నుంచి నేర్చుకున్న ఒక చిన్న విషయం ఉంది, మనం ఏదైనా ప్రారంభం చేసినప్పుడు ఎక్కువమంది ఉత్సాహంగా వస్తారు, కొన్ని రోజులకు చాలా తక్కువ మంది మిగులుతారు. రానివారి గురించి బాధపడటం కంటే వచ్చిన వారితో కార్యక్రమం చక్కగా నడిపించవచ్చు. సంఖ్య మీద శ్రద్ధ చూపించకుండా కార్యక్రమం మీద శ్రద్ధ చూపాలి అని చెప్పేవారు. ఇది నాకు కూడా వారు అనుగ్రహించారు. మహానుభావులది అందరిదీ ఒకటే మార్గం. "శ్రీ శ్రీ శ్రీ వద్దిపర్తి పద్మాకర్" గురుదేవులవారిది కూడా ఇదే మార్గం.

******

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

# ఐశ్వర్య యోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృత కలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికి అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితాసహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తన జీవిత గమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము.


## 302. హ్రీమతీ (ఓం ఐం హ్రీం శ్రీం హ్రీమత్యై నమః)

'హ్రీ' అనగా సిగ్గు లేక వినయము. లజ్జను ప్రదర్శిస్తుంటుంది కనుక అమ్మవారిని హ్రీమతి అంటారు. ఇంచించుక సిగ్గుగలది అనగా కొంచెం కొంచెం సిగ్గు గల ఉత్తమ స్త్రీని హ్రీమతి అంటారు. శ్రీ దేవీసప్తశతిలో ఇలా ఉన్నది -

శ్లో|| యాదేవీ సర్వభూతేషు, లజ్జారూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై, నమస్తస్యై నమోనమః ||

అన్ని ప్రాణులలో లజ్జారూపంలో ఉన్న దేవికి నమస్కరిస్తున్నాను అని దీని భావం. కొన్ని పాఠాంతరాలలో 'హ్రీంమతీ' అనే నామాన్ని చూడవచ్చును. అప్పుడు హ్రీం అనే బీజస్వరూపిణి అని అర్థం వస్తుంది. 'హ్రీ' అంటే వినయం అని కూడా అర్థం, వినయం కలిగిన స్త్రీ రూపంలో ఉంటుంది కనుక అమ్మవారిని హ్రీమతి అంటారు. వినయం కలిగిన వారంటే అమ్మవారికి చాలా ఇష్టం.

మంత్రప్రయోగం — ఫలితం — కొందరు ఏమాత్రం వినయం ప్రదర్శించరు. పెద్దల దగ్గర, పై అధికారుల వద్ద లజ్జావినయాలు ప్రదర్శించకపోతే ఎంతటివాడైనా పతనమవుతాడు. అందునా బాల్యయౌవనాలలో అవినయం వల్ల జీవితమే పాడవుతుంది. ఈ మంత్రాన్ని తొంబదిదినములు (90) జపం చేస్తూ, అమ్మవారిని ఉమ్మెత్త లేక గన్నేరు ఆకులు, గన్నేరు పూలతో పూజిస్తే వినయం, జీవితంలో ఎలా ఉండాలి అనే బుద్ధి లభిస్తుంది. జపసంఖ్య మన అవసరాన్ని బట్టి 108 నుండి 1008 వరకు ఉండాలి. జపసంఖ్య పెరిగే కొలది ఫలితం కూడా పెరుగుతుంటుంది. అమ్మవారికి ఈ జపకాలంలో వండిన ఆకుకూరలు, కొంచెం అన్నం కలిపి నివేదించాలి. ఆ ఆహారాన్ని ప్రసాదంగా తిని ఇతరులకు కూడా పెట్టడం మంచిది. (జపం చేసేటప్పుడు ' ఓం ఐం హ్రీం శ్రీం హ్రీమత్యై నమః ' అని జపించాలి)




... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# పురాణం లో మహిళలు

## బ్రహ్మవాదిని అపాల

పురాణంలో మహిళలు అనే అంశంలో భాగంగా మనం తెలుసుకోబోయేటటువంటి స్త్రీమూర్తి అపాల. అపాల అత్రి మహర్షి యొక్క కుమార్తె. ఆమె ఏకసంథాగ్రాహి. అపారమైన జ్ఞాపకశక్తి ఆమె సొత్తు. ఉచ్చారణాదోషాలు లేకుండా, వ్యాకరణదోషాలు లేకుండా వేదగానం చేసేది. ఉత్కృష్టమైనటువంటి జ్ఞానసంపద ఆమె సొంతం. అయితే ఆమె ఒక చర్మవ్యాధితో బాధపడేది. ఇంతటి మంచి గుణాలు ఉన్నా చర్మవ్యాధి వ్యధగా తయారయింది. చర్మవ్యాధి కారణంగా అత్రిమహర్షి కూడా కొంత విచారంగా ఉండేవాడు. ఎంతోమంది వైద్యులను పిలిపించి వైద్యం చేయించినప్పటికీ ప్రయోజనం కలగలేదు. అందమైనశరీరం అందవిహీనంగా మారింది. అత్రి మహర్షి సంతానం విషయంలో సామాన్యమానవునిలాగా కూతురి జీవితం కోసం దుఃఖాన్ని అనుభవిస్తూ ఆమె భవిష్యత్తు కోసం ఆరాటపడ్డాడు. అపాలకు చర్మరోగం కారణంగా ఏర్పడిన లోపాన్ని సవరించడానికి తన విద్యను కూతురికి నేర్పించాడు. ఆమె అత్యంతమేధావిగా మారింది. అపాల కోసం అత్రిమహర్షి వరాన్వేషణ ప్రారంభించాడు. కానీ ఏ ఒక్కరూ కూడా ఆమెను వివాహం చేసుకోవడానికి ముందుకు రాలేదు. కొద్దికాలం తరువాత ఒకనాడు బ్రహ్మచారి అయిన కృతాశ్వుడు అత్రి మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. అతడు తపోబలసంపన్నుడు. అపాలను చూసి వివాహం చేసుకుంటానని అత్రిమహర్షితో చెప్పాడు. ఆయన అంగీకారంతో ఆశ్రమంలో వారి వివాహం జరిపారు. కొంతకాలానికి చర్మవ్యాధి ఎక్కువ కావడంతో భర్త ఆదరణను అపాల కోల్పోయింది. భార్య శరీరంపై ఉన్న తెల్లమచ్చలు ఆయనకు ఏహ్యభావాన్ని కలిగించాయి. అపాల తన భర్త తిరస్కారానికి గురియై పుట్టింటికి చేరింది. తపోబలసంపన్నుడు అయినప్పటికీ కృతాశ్వుడు ఒక సామాన్య మగవానివలె బాహ్యసౌందర్యానికి ప్రాధాన్యం ఇచ్చి అపాలను తిరస్కరించాడు. అత్రిమహర్షి ఆశ్రమవాసులు కూడా దుఃఖించారు. క్రమంగా దుఃఖాన్ని దిగమింగి, అపాల తన తండ్రి ఆశ్రమవాతావరణానికి అలవాటుపడింది. అత్రిమహర్షి అపాలను తపస్సు చేయమని ఆదేశించాడు. ఆమెను బ్రహ్మవాదినిగా తీర్చిదిద్దాలని నిశ్చయించుకొని నియమనిష్ఠలతో తపస్సు చేయమని ఆదేశించాడు.




తండ్రి ఆదేశం మేరకు ఆమె అత్యంత నియమనిష్ఠలతో తపస్సు చేసి ఇంద్రుడిని ఉపాసించినది. ఇంద్రుడు ప్రత్యక్షమై ఆమెతో ఆశ్రమానికి వెళ్ళాడు. శ్రద్ధాభక్తులతో ఇంద్రునికి ఆహారం అందించింది. సోమరసాన్ని నలగగొట్టటానికి రాయి కనిపించకపోవడంతో, ఆమె తన పళ్ళతో నలగగొట్టి ఇంద్రుడికి సోమరసాన్ని అందించింది. దానికి సంతోషించిన ఇంద్రుడు మూడు వరాలు ఇచ్చాడు. మొదటి వరంగా అపాల తండ్రిని కేశవంతునిగా చేసాడు. రెండవ వరంగా బంజరుభూమిగా ఉన్న ఆశ్రమప్రదేశాన్ని సస్యశ్యామలం చేసాడు. మూడవవరంగా అపాలకు సూర్యసమానతేజోవంతమైన శరీరాన్ని ఆమెకు

ప్రసాదించాడు. ఈ విధంగా రోగ విముక్తి పొందిన ఆమెను చూచి ఆశ్రమవాసులు, అత్రిమహర్షి కూడా బహుధా సంతోషించారు. మనం ఈ కథ ద్వారా వేదాధ్యయనం, తపస్సు అనేవి కేవలం పురుషులకు మాత్రమే అనే అపోహను వదిలివేసి తండ్రి సూచనతో తపస్సు చేసి అపాల బ్రహ్మావాదినులలో ఒకరిగా అయినది. దీనిని బట్టి రూపంలో స్త్రీపురుషులు వేరుగా ఉన్నా మేధాసంపత్తిలో ఇద్దరూ ఒకటే అని నిరూపిస్తూ స్త్రీ తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, విద్యతో ఎటువంటి లోపాన్ని అయినా అధిగమించవచ్చునని స్త్రీవిద్య యొక్క ఆవశ్యకతను చెప్పకనే అపాల పాత్ర ద్వారా మనకు పురాణాలు తెలియజేసాయి.

*****

## స్తోత్రమాలిక

గరుడ పురాణంలో ఆచారకాండంలో నూటతొంభైనాల్గవ అధ్యాయంలో వైష్ణవకవచము అని ఒక కవచము వున్నది. ఇది అత్యద్భుతమైన మంత్రశాస్త్ర రహస్యం. ఈ వైష్ణవ కవచాన్ని భక్తిశ్రద్ధలతో నలభైరోజులపాటు ఉదయం పారాయణం చేసుకున్నవాడు భయంకరరోగాల నుంచి విముక్తి పొందుతాడు, అనుకున్న పనులు అవుతాయి. రాత్రిపడుకోబోయే ముందు ఈ కవచమును పారాయణము చేసి పడుకునేవాడికి దుస్వప్నములు రావు, అకాలమరణము రాదు, యమభయం వుండదు. నిత్యం ఒక్కసారైనా ఈ వైష్ణవకవచమును పారాయణము చేసినా లేక ఇప్పుడు నేను పారాయణము చేసిన దాన్ని విన్నా ఆ వ్యక్తికి అనుకున్నపనులు అవుతాయి. కంటికి చూపు రావాలనుకుని కంటి మీద చెయ్యిపెట్టి ఈ కవచము విన్నవాడికి చూపు బాగా అభివృద్ధి అవుతుంది. అవయవాల నొప్పులు తొలగడానికి ఎక్కడ నొప్పి వుంటే అక్కడ ఆ అవయవము మీద చెయ్యిపెట్టి ఇది పారాయణం చేస్తే ఆ నొప్పులు తగ్గుతాయి. ఇలా ఒకటి కాదు సర్వ ఉపద్రవాలనీ నాశనం చేసే అపూర్వమైన కవచం "వైష్ణవ కవచం". ఈ వైష్ణవకవచం చదివే చోట భూతాలు, ప్రేతాలు, పిశాచాలు ఇవి ఏవీ అడుగుపెట్టలేవు. ఏ చేతబడులు, ఏ దుష్టశక్తులు ఆ ప్రాంతంలోకి రావు. అంత గొప్పదిది. ఇది గరుడ పురాణంలో ఆచారకాండంలో నూటతొంభైనాల్గవ అధ్యాయంలో పద్నాలుగు నుంచి ఇంచుమించుగా వుంటుంది. పద్నాల్గవ అక్షరం నుంచి, శ్లోకాల్లో అయితే నాల్గవ శ్లోకం నుంచి ఇరవై రెండవ శ్లోకం వరకు వుంటుంది. పరమపవిత్రమైన ఈ వైష్ణవకవచాన్ని ప్రతీ ఆదివారము పఠించి లేదా విని కొంచెం నువ్వులు బెల్లం కలిపి తింటే సత్సంతానం ముఖ్యంగా పురుషసంతానం కలుగుతుంది. విడిచిపెట్టకుండా సంవత్సరం పాటు దీనిని భక్తితో పారాయణము చేసుకున్నవాడికి సంపద కలుగుతుంది. ప్రతీ బుధవారం చొప్పున తొమ్మిది బుధవారాలు దీనిని విని పానకం విష్ణువుకి నివేదించి త్రాగినవాడికి అనేక మూత్రసంబంధ, నరసంబంధ రోగాలు తొలగిపోతాయి. విషరోగాలు తొలగిపోతాయి.అనుదినం కొంచెం బెల్లంముక్క నివేదనము చేసి ఆ బెల్లం ముక్కని తాను ప్రసాదంగా తిని ఇతరులకు పెడితే వారికి అనేక దేహ సంబంధ విషజ్వరాలు, రోగాలు తొలగిపోతాయి. ఇలా ఒకటికాదు, శత్రు పీడను తొలిగించి, శుభాలను కలిగించి కుటుంబ వృద్ధిని, ధన ధాన్యవృద్ధిని కలిగించే అపూర్వమైనటువంటి కవచము ఇది. ఈ వైష్ణవకవచం మానవులకు పాశుపతాస్త్రం కంటే గొప్పది. సుదర్శనచక్రం వంటిది. అంత గొప్ప వైష్ణవకవచాన్ని వినండి, పఠించండి, పారాయణం చేయండి, తరించండి. ఇది స్త్రీ, పురుషాదులందరూ కూడా చేసుకోవచ్చును. కాస్త శ్రద్ధతో మాత్రమే పారాయణము చెయ్యండి, భక్తితో వినండి. భక్తి లేనివాళ్ళకు మాత్రం ఇది ఫలించదు.

విష్ణుర్మమాగ్రతః పాతు కృష్ణో రక్షతు పృష్ఠతః

హరిర్మే రక్షతు శిరో హృదయంచ జనార్దనః (1)

మనోమమ హృషీ కేశో జిహ్వాం రక్షతు కేశవః

పాతు నేత్రే వాసుదేవః శ్రోత్రే సంకర్షణో విభుః (౨)

ప్రద్యుమ్నః పాతుమే ఘ్రాణం అనిరుద్ధస్తు చర్మచ

వనమాలా గలస్యాంతం శ్రీవత్సో రక్షతాదధః (3)

పార్శ్వం రక్షతు మే చక్రం వామం దైత్య నివారణం

దక్షిణంతు గదా దేవీ సర్వాసుర నివారిణీ (4)

ఉదరం ముసలం పాతు పృష్ఠంమే పాతు లాంగలం

ఊర్ధ్వం రక్షతుమే శార్ఙ్గం జంఘే రక్షతు నందకః (5)

పార్ష్ణీ రక్షతు శంఖశ్చ పద్మం మే చరణావుభౌ

సర్వకార్యార్థ సిద్ధ్యర్థం పాతు మాం గరుడః సదా (6)

వరాహో రక్షతు జలే విషమేషు చ వామనః

అటవ్యాం నరసింహశ్చ సర్వతః పాతు కేశవః (౭)

హిరణ్యగర్భో భగవాన్ హిరణ్యం మే ప్రయచ్ఛతు

సాంఖ్యాచారస్తు కపిలో ధాతు సామ్యం కరోతుమే (8)

శ్వేత ద్వీప నివాసీచ శ్వేత ద్వీపం నయత్వజః

సర్వాన్ సూదయతాం శత్రూన్ మధుకైటభ మర్దనః (౯)

సదా కర్షతు విష్ణుశ్చ కిల్బిషం మమ విగ్రహాత్

హంసోమత్స్యః తథా కూర్మః పాతుమాం సర్వతోదిశమ్ (10)

త్రివిక్రమస్తు మే దేవః సర్వపాపాని కృంతతు

తథా నారాయణో దేవో బుద్ధిం పాలయతాం మమ (11)

శేషో మే నిర్మలం జ్ఞానం కరోత్వజ్ఞాన నాశనం

బడబాముఖో నాశయతాం కల్మషం యత్కృతం మయా (1౨)

పద్భ్యాం దదాతు పరమం సుఖం మూర్ధ్ని మమ ప్రభుః

దత్తాత్రేయః ప్రకురుతాం సపుత్ర పశుబాంధవం (13)

సర్వానరీన్ నాశయతు రామః పరశునా మమ

రక్షోఘ్నస్తు దాశరథిః పాతు నిత్యం మహాభుజః (14)

శత్రూన్ హలేన మే హన్యాద్ రామో యాదవనందనః

ప్రలంబకేశి చాణూరపూతనాకంసనాశనః

కృష్ణస్య యో బాలభావః సమే కామాన్ ప్రయచ్ఛతు (15)

అంధకార తమో ఘోరం పురుషం కృష్ణ పింగళం

పశ్యామి భయ సంత్రస్తః పాశహస్త మివాంతకం (16)

తతోఽహం పుండరీకాక్షం అచ్యుతం శరణం గతః

ధన్యోఽహం నిర్భయో నిత్యం యస్యమే భగవాన్ హరిః (1౭)

ధ్యాత్వా నారాయణం దేవం సర్వోపద్రవ నాశనం

వైష్ణవం కవచం బద్ధ్వా విచరామి మహీ తలే (18)

అప్రధృష్యోఽస్మి భూతానాం సర్వదేవమయోహ్యహం

స్మరణా ద్దేవ దేవస్య విష్ణో రమిత తేజసః (1౯)

# సంక్రాంతి విశేషాలు

పుష్యమాసంలో వైకుంఠం నుండి లక్ష్మీదేవి భూలోకానికి వచ్చి భక్తులను అనుగ్రహిస్తుంది. అందుకే పుష్య మాసమునకు పౌష్యలక్ష్మి అని కూడా పేరు. ఈ పౌష్యలక్ష్మి మూడు రోజుల పాటు భక్తులను అనుగ్రహిస్తుంది. ఆ మూడు రోజులు వరుసగా భోగి,మకర సంక్రాంతి, కనుమ

| | |
|---|---|
| 1 | భోగి |
| 2 | మకర సంక్రాంతి |
| 3 | కనుమ |

ఈ మూడింటిని త్రివిధ మహాలక్ష్ములు అని కాళికా పురాణం చెబుతున్నది. లక్ష్మీదేవి మూడు రూపములలో వున్నది. లక్ష్మీదేవి మొదటి రూపం భోగి అనే పండుగ రూపంలో ఉన్నది. రెండవ రూపం సంక్రాంతిలక్ష్మీస్వరూపం లో ఉన్నది. మూడవది కర్షకలక్ష్మి. ఆ కర్షక శబ్దమే తెలుగులో కనుమ అయిపోయినది.

## భోగి:

మొదటి రోజును భోగి అంటారు. దీనికి భోగి అని ఎందుకు పేరు వచ్చింది. భోగః అస్తి ఇతి భోగి. భోగము కలిగినది భోగి. భోగము అంటే ఏమిటి ? పాము యొక్క చుట్టలను, పాము శరీరాన్ని భోగము అంటారు. పాములు మనలా కాకుండా పొడవైన శరీరంతో ఉంటాయి. ఆ శరీరాన్ని చుట్టల క్రింద చుట్టుకుంటాయి. త్రాచుపామును తన శరీరాన్ని చుట్టలా చుట్టుకుని ఉంటుంది. ఈ పాము శరీరపు చుట్టలను భోగము అంటారు. భోగి అనే పేరు ఈ పండుగకు ఎందుకు వచ్చింది అంటే! మన శరీరంలో వెన్నుపూస భాగంలో ఒక సర్పం ఉన్నది. అది సర్పాకారంలో ఉంటుంది కనుక దానిని వెన్నుపాము అంటారు. దీనినే యోగశక్తిలో, యోగ పర్యాయపదాలలో కుండలిని అంటారు. మన వెన్ను ఎముకని మూడు చుట్టలు చుట్టుకుని, పడగ కిందకు పెట్టి తోక పైకి పెట్టిన ఒక పాము ఎలా ఉన్నదో అటువంటి ఆకారంలో ఉన్న ఒక శక్తి ఉన్నది. ఆ శక్తినే భోగము కలిగిన శక్తి కనుక భోగము అన్నారు. అది భౌతికంగా భోగి అనే రూపంలో వచ్చింది. ఈ శక్తిని నడిపేటటువంటి తల్లికి భోగలక్ష్మి అని పేరు. మన ప్రాణులకు మూడు గుణాలు ఉన్నాయి. ఒకటి తమోగుణం రెండవది రజోగుణం, మూడవది సత్వగుణం. తమోగుణం అంటే బాగా బద్ధకం, ఎక్కువగా నిద్రపోవడం, తన మీద తనకు నియంత్రణ లేకపోవడం, తినకూడనివి విపరీతంగా తినడం, ఒక్కొక్కప్పుడు అసలు తినకుండా ఉండటం. ఈ లక్షణములను తమోగుణములు అంటారు. ఇక రెండవది రజోగుణం. రజోగుణం అంటే క్రోధము, ఎర్రబడటం, కారము మీద ఆసక్తి, నేను గొప్పవాడినని అహంకారం, నేను ఏ పనైనా చేయగలను, ఇక ఎవరినీ లెక్క చేయను అనుకోవడం. ఇదంతా రజోగుణం లోని భాగం. మూడవది సత్వగుణం, శాంతముగా ఉండుట. పని చేసేటప్పుడు తప్ప అనవసరంగా మాట్లాడకుండా ఉండుట అతిగా వాగకుండా ఉండటం. తొందరపడకుండా ఉండటం. అలాగని ఎవరైనా చేయరాని పనులు చేస్తే అప్పుడు మాత్రం వాడిని క్షమించకుండా అవసరమైతే వాడిని శిక్షించే శక్తి కలిగి ఉండటం. ఇవన్నీ సత్వగుణం లోకి వస్తాయి. ఈ మూడు గుణములు మూడు చుట్టలుగా పాముకు ఉన్నాయట. ఆ మూడు చుట్టలు ఒకటి తమోగుణం, ఒకటి రజోగుణం, ఒకటి సత్వగుణం. ఈ మూడు చుట్టలతో కలిగిన పాము భూలోకానికి దిగివచ్చిన రోజుని భోగి అంటారు. ఇంతకీ ఆ పాము ఎవరు? ఆయనే ఆదిశేషుడు. ఆయన యోగశక్తికి మూలకారకుడు. ఆయన మన శరీరం లో ఉంటాడు. ఆ యోగశక్తి మీద, ఆదిశేషుడు మీద పడుకుంటాడు కాబట్టే విష్ణువు ఎప్పుడు యోగి అవుతున్నాడు. అంటే మనుష్యులను భయంకరమైన వ్యాధుల నుంచి, భయంకరమైన దుర్గుణముల నుంచి

బయటపారవేసి, వారిని విష్ణుస్వరూపం గా మార్చే పండుగ భోగి. అందుకే భోగి అంటే ఏమిటి ? మనిషిని చెడ్డ గుణాలు నుంచి బయటకు తీసుకువచ్చే పండుగ. మనిషిని యోగిగా మార్చే పండుగ. ఈ పండుగ ఒక రోజు రూపంలో, ఒక తిథి రూపంలో ఉన్నది. ఈ తిథినాడు మనం ఏమి చేస్తే మనం విష్ణుస్వరూపులం అవుతాం.

భోగి నాడు ఆచరించవలసిన విధులు:

1) భోగినాడు తెల్లవారు జామున లేవాలి .

2)కనీసం ఈ పండుగ మూడు రోజులైనా తెల్లవారుజామున నాలుగు గంటలకు లేవడం చాలా మంచిదట. సూర్యోదయానికి ముందు లేచి, ఒళ్లంతా నువ్వుల నూనెతో కూడినటువంటి పిండిని నలుగు కింద పెట్టు కోవాలి .

3)భోగినాడు ఒంటికి నువ్వుల నూనె పూసుకుని, ఆ తరువాత సున్నిపిండితో నలుచుకుని, ఆపై కుంకుడు కాయల పులుసుతో తలంటుకొని స్నానం చేస్తే మనిషిలో ముందు తమోగుణం తొలగుతుంది. రజోగుణం తగ్గుతుంది. ఈ రెండూ ఎప్పుడైతే తొలగుతాయో సత్వగుణం పెరుగుతుంది. అప్పుడు ఆ వ్యక్తి శరీరంలో ఉన్న బద్ధకం వంటి రోగాలన్నీ తొలగిపోతాయి. ప్రతి వ్యక్తికి లోపల వాయువులు ఉంటాయి. దానినే ఇవ్వాళ మనం గ్యాస్ట్రిక్ ట్రబుల్ అని పిలుస్తున్నాం. వాయు ప్రకోపనం తగ్గుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. ఆలోచనాశక్తి పెరుగుతుంది.

4)నెత్తిమీద కాస్త నూనె పెట్టుకుని ఆ తర్వాత కుంకుడుకాయల పులుసు తోటి రుద్దుకుని స్నానం చేస్తే ఈ భోగినాడు మంచి విచక్షణా జ్ఞానం వస్తుంది. ఆలోచనా పటిమ పెరుగుతుంది, జ్ఞానం పెరుగుతుంది ప్రపంచంలో ప్రతిప్రాణిని తనతో సమానంగా చూడగలిగే శక్తి పెరుగుతుంది. భోగి అంటే యోగశక్తిని పెంచేది త్రిగుణాలలో దుర్గుణాలను తొలగించి సత్వగుణం పెంచేది కాబట్టి తెల్లవారుజామున లేచి ఒంటికి నువ్వుల నూనె పూసుకుని ఆ తరువాత నలుగు పెట్టుకుని తలంటుకొని స్నానం చేయి అని చెప్పారు.

5)నుదుట విభూతి కానీ త్రిపుండ్రం కానీ బొట్టు కానీ లేకుండా వీధి లోకి వెళ్లడం పరమ దోషమట. దీని గురించి సౌర పురాణంలో 'దిగ్భస్మ రహితం ఫాలం' అన్నారు. స్నానానంతరం భోగినాడు భస్మం ధరించకపోతే అటువంటివాడి నుదుటి ముఖాన్ని చూడకూడదు. వాడి ముఖాన్ని కానీ, వాడి నుదుటిని కానీ చూడకూడదు. ఆ నుదురు చూడడమే పాపం. సంప్రదాయం ప్రకారంగా వైష్ణవసంప్రదాయం వాళ్ళయితే మూడునామాలు ధరించాలి. త్రిపుండ్రం ధరించాలి. ఊర్ధ్వపుండ్రం ధరించాలి. అలా ఊర్ధ్వపుండ్రం ధరించకపోతే వాడి ముఖం చూడకూడదు. స్మార్తాచారం ప్రకారం విభూతి కానీ, లేక వైష్ణవ ఆచారం ప్రకారం ఊర్ధ్వపుండ్రం కానీ ధరించని ముఖం చూడరాదు, ఇక శక్తిని పూజించే వాళ్లయితే ఎఱ్ఱని కుంకుమ ధరించాలి కనీసం ఆ కుంకుమ నైనా ధరించండి ధరిస్తే అప్పుడు ఆలోచన పెరుగుతుంది అని చెప్పారు

6)భోగి నాడు ఆవు పేడ తోటి పిడకలు చేసి వాటిని ఎండబెట్టి, ఆ పిడకల మీద పాయసం కాచి, ఈ పాయసాన్ని తాము తినడం వలన మనిషికి అనేకరకాలైన ఆరోగ్యశక్తులు వస్తాయి. జ్ఞాపక శక్తి పెరుగుతుంది. ఈనాడు కలియుగంలో చాలామందికి జ్ఞాపక శక్తి చాలా తక్కువగా ఉంటోంది. అన్నింటికీ పుస్తకాలు చూసుకోవలసి వస్తుంది లేదా కంప్యూటర్ చూసుకోవాల్సి వస్తుంది. అటువంటి వ్యక్తులకి జ్ఞాపకశక్తి పెరగాలంటే భోగినాడు ఆవు పిడకల మీదవండినటువంటి పాయసం భగవంతునికి, ఇష్టదేవతకి నివేదన చేసి దానిని ప్రసాదంగా తినండి అని పురాణాలు చెప్పాయి.

7)ఆవు పేడ చాలా గొప్పది ఈ ధనుర్మాసమంతా ఈ ఆవు పేడతో గొబ్బెమ్మలు అని చేసి సాయంకాలం అయ్యాక ఈగొబ్బెమ్మలను గోడకి పిడకలు కింద చరిచేవారు. ఈ పిడకలు క్రమక్రమంగా ఎండకు ఎండేవి. ఎండిన వాటిని

ఈ భోగినాడు భోగిమంటగా వేసుకుంటారు. మార్గశీర్ష మాసం అంటే గజగజ వణికించే చలికాలం. ఆ చలికాలంలో ఆవుపేడతో తయారైన పిడకలతో మంట చేసుకుని భోగిమంట చేసుకుని శరీరాన్ని అలా కాచుకుంటే శరీరంలోకి అగ్ని ప్రవేశిస్తాడు. ఈ అగ్ని అపూర్వమైన చైతన్యం ఇస్తాడు. జ్ఞానం ఇస్తాడు. ఆరోగ్యం ఇస్తాడు. అందుకే ఆవు పిడకలుతో తయారుచేసిన మంట దగ్గర శరీరాన్ని కాచుకోవాలి. ఇది భోగినాడు చేయవలసిన పని.

8) భోగినాడు పప్పులు బెల్లాలు పిల్లలకు పంచి పెట్టిన వాళ్లకి సత్సంతానం కలుగుతుంది.

## మకర సంక్రాంతి

ఇక రెండవ రోజు ఈ పండుగల్లో రెండో రోజుకి మకర సంక్రాంతి అనే పేరు. ఇది అపూర్వ పుణ్యకాలం సూర్యుడు వరుసగా మేషం మొదలుకొని మీనం వరకు 12 రాశులలోకి ప్రవేశిస్తూ ఉంటాడు. ప్రతి మాసంలో అందులో మకరరాశిలోకి సూర్యుడు ప్రవేశించిన కాలాన్ని మకరసంక్రమణము అన్నారు. సూర్యుడు ఈ రోజున మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ఈరోజు నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. దేవతలు నిరంతరం భూలోకంలో తిరిగే దివ్యకాలం ఉత్తరాయణం అంటే. మహాభారతంలో భీష్ముడు అంపశయ్య మీద పడిపోయినప్పుడు దేవతలు, అయ్యో ఇది దక్షిణాయనం. దక్షిణాయనంలో యుద్ధంలో మరణిస్తే పర్వాలేదు, కానీ నేల మీద పడి కొంత కాలం బ్రతికి తర్వాత మరణిస్తే అటువంటి వారికి ముక్తి రాదు అని శాస్త్రం చెబుతున్నది. స్వర్గం రాదని చెబుతున్నది. ఇతడు చూస్తే దక్షిణాయనంలో మరణిస్తున్నాడు అని దేవతలు కొంచెం బాధపడ్డారు. ఈ మాటలు భీష్ముడు విన్నాడు. కాబట్టి దక్షిణాయన పుణ్యకాలంలో మరణిస్తే ఎంత గొప్పవాడైనా పొందవలసిన సద్గతులు పొందడట. ఉత్తరాయణ పుణ్యకాలంలో మరణిస్తే పాపాత్ములు కూడా భయంకర నరకాల నుంచి విముక్తి పొంది స్వర్గం వంటి ఊర్ధ్వ లోకాలకు వెళతారు. అందుకనే భీష్ముడు దేవతలారా! ఉత్తరాయణం వచ్చేదాక నా శరీరంలో ప్రాణం నిలబెట్టుకుంటాను. మా నాన్న నాకు వరం ఇచ్చాడు. ఆ వరం ప్రకారం ప్రాణం నిలబెట్టుకుంటానన్నాడు. ఇంతకీ ఆ ఉత్తరాయణం ఎప్పుడు మొదలవుతుంది అంటే మకర సంక్రమణంతో మొదలవుతుంది. మకర సంక్రమణం గురించి పురాణములు అద్భుతంగా చెప్పాయి. అందులో సూర్యుడి యొక్క చరిత్ర ఉన్న సౌర పురాణం లో అయితే మకర సంక్రమణం సూర్యుడు సరాసరి భూలోకానికి వచ్చి మానవులను అనుగ్రహించేటటువంటి రోజు అని చెప్పింది. మకర సంక్రమణం నాడు సూర్యభగవానుడు మన లాంటి ఒక మానవాకారము ధరించి భూమండలమంతా తిరుగుతాడు. ఈరోజు లక్ష్మీదేవి సంక్రాంతి లక్ష్మి అనే పేరుతో లోకాలన్నీ తిరుగుతుంది. ఈరోజు త్రిమూర్తులు ముగ్గురూ అంటే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు మారువేషాలు ధరించి భిక్షుకరూపాలు ధరించి లోకమంతా పర్యటిస్తారు. ఇప్పుడు వీళ్ళ అనుగ్రహం మనం పొందాలంటే ఏం చేయాలి.

### మకర సంక్రాంతి నాడు ఆచరించవలసిన విధులు:

1) మకర సంక్రమణం నాడు కూడా తెల్లవారుజామున లేచి స్నానం చేయాలి.

2)స్నానం చేసాక పూజామందిరంలో ప్రవేశించాలి. యథాశక్తిగా కుంకుమ లేక ఊర్ధ్వపుండ్రం భస్మం ధరించాలి. ఉతికిన బట్టలే కట్టుకోవాలి, అవకాశం ఉన్నవారు పట్టుబట్టలు కట్టుకోవాలి

3) సంక్రాంతి రోజున దర్భాసనం మీద కూర్చున్నవాడు భయంకర దారిద్ర్యము నుంచి విముక్తి పొందుతాడు. దర్భలు అత్యంత పవిత్రమైనవి వాటిమీద ఎప్పుడైనా పూజాకాలంలో కూర్చోవచ్చు. అందునా సంక్రమణం నాడు మకర సంక్రమణం నాడు దర్భాసనం మీద కూర్చుని దేవతారాధన చేస్తే అటువంటివాడు జన్మజన్మల దారిద్ర్యంనుంచి విముక్తి పొందుతాడు. దీని గురించి బ్రహ్మవైవర్త పురాణంలో ఒక కథ ఉంది పూర్వకాలం ఒక

ఆవిడ చాలా కాలం పాటు, దాదాపు ఒక నలభై సంవత్సరాల కాలం పాటు పుట్టినప్పటి నుంచి 40 ఏళ్లు వచ్చేదాకా కటిక దారిద్ర్యం అనుభవించింది .ఈ దారిద్ర్యం నుంచి బయట పడటానికి ఏం చేయాలో తెలియక ఏడుస్తూ ఉండగా అదృష్టవశాత్తు ఆఊళ్లోకి అగస్త్యమహర్షి వచ్చాడు. అప్పుడు అగస్త్యుడు కాళ్లు పట్టుకుని నేను 40 ఏళ్ల వయస్సులోకి అడుగు పెట్టానండి. ఇప్పటివరకు భయంకర దారిద్ర్యం అనుభవిస్తున్నాను. నాకు సంపదలు రావాలంటే ఏం చేయాలో ఒక మంచి మార్గం సూచించండి అని అగస్త్యుని అడిగింది. అప్పుడాయన సంక్రాంతి నాడు తెల్లవారుజామునే లేచి స్నానం చేసి దర్భాసనం అనగా దర్భలతో తయారుచేసిన చాప మీద కూర్చో, ఆ పూట లక్ష్మీదేవిని పూజించు. లక్ష్మికి చెరుకుగడలు, పానకము ఈ రెండూ నైవేద్యంగా పెట్టు. తామరపూలతో పూజించు. దారిద్ర్యం పోతుంది అన్నాడు, ఆమె అలాగే చేసింది. మకరసంక్రమణం రోజున లక్ష్మీదేవిని దర్భాసనం మీద కూర్చుని పూజించింది. పూజించేటప్పుడు అమ్మవారికి చెరుకుముక్కలు, చెరుకుపానకం నైవేద్యం గా పెట్టింది. తామర పువ్వులతో పూజించింది. వెంటనే లక్ష్మి ప్రత్యక్షమై ఈ సంక్రాంతి రోజున నేను పొష్యలక్ష్మి లేక సంక్రమణలక్ష్మి లేక సంక్రాంతిలక్ష్మి అనే పేరుతో కొలువై ఉంటాను. ఆ సమయంలో దర్భలపై కూర్చుని నన్ను పూజించావు కనుక నీ దారిద్ర్యం తొలగిస్తున్నాను. నీకు అష్టైశ్వర్యములు ఇస్తున్నాను అన్నది. ఒక కటిక దరిద్రురాలిని పరమ ఐశ్వర్య సంపన్నురాలుగా మార్చిన దివ్య పర్వదినం మకర సంక్రమణ దినం. కాబట్టి సంక్రాంతి రోజున యథాశక్తిగా లక్ష్మీదేవిని పూజించాలి.

4)ఈ రోజు పూర్తిగా ఆవు పాలతో తయారు చేసిన పాయసం వండి అమ్మవారికి నివేదన చేసి తాము తిని పిల్లలకు పెడితే అటువంటి వారికి సత్ సంతానం ప్రాప్తి కలుగుతుంది. పిల్లలు లేనివారు ఆవుపాలతో వండిన పాయసం అమ్మకి, మహాలక్ష్మికి నివేదన చేయాలని దానిని తాము తినాలని, చిన్నపిల్లలకు కూడా ప్రసాదంగా పెట్టాలని, పెడితే వారికి సంతానం కలుగుతుందని మంత్రశాస్త్రం చెబుతోంది. ఈ రోజు పిల్లలకు ప్రసాదం పెట్టినవారు అయితే సంతానం పొందుతారు. అప్పటికే సంతానం ఉన్నవాళ్లు అయితే ఆ సంతానమునకు సద్బుద్ధి వచ్చేలా చేయగలుగుతారు. అనగా పాయసం నివేదన చేసి, తాము కొంత తిని పిల్లలకు ఆ ప్రసాదం పెడితే ఆ ఇంటిలోని మన పిల్లలు బుద్ధిమంతులు అవుతారు. పిల్లలు సక్రమంగా ఉండడం కంటే బుద్ధిమంతులుగా ఉండడం కంటే జ్ఞానం పొందిన వాళ్లయిన వాళ్ళుగా ఉండడం కంటే గొప్పసంపద మరొకటి లేదు. మనిషికి ఏమున్నా లేకపోయినా సత్సంతానం ఉండాలి. సంతాన అందరికీ ఉంటుంది, వాళ్ళు బుద్ధిమంతులు అయితేనే కదా తనకి ఉపకారం, లోకానికి ఉపకారం. కాబట్టి పిల్లలు బాగుపడడానికి ఈపని చేయాలని శాస్త్రం చెబుతున్నది.

5)సంక్రాంతినాడు శ్రీసూక్తం విన్నా, హరినామస్మరణం చేసినా, హరిదాసు నెత్తి మీద ఉన్న పాత్రలో బియ్యం వేసినా, స్వయంపాకం దానం చేసినా వాడు సకలసంపదలు, శుభాలు పొందుతాడు. పూర్వకాలంలో మకర సంక్రమణంరోజున కుష్మాండం దానం చేసేవారు. కుష్మాండం అనగా గుమ్మడికాయ. గుమ్మడికాయని స్వయంపాకంతో కలిపి పండితుడికి దానం చేస్తే ఈ సంక్రాంతి రోజున అటువంటి వాళ్ళ కుటుంబం యావజ్జీవితం ఆనందంతో గడుస్తుంది. అనారోగ్యం నుంచి బయట పడడానికి పూర్వం సాంబుడు అనే వాడు ఈ పని చేసాడు. సాంబుడు అనే కృష్ణుడుకి ఒక కొడుకు ఉన్నాడు. జాంబవతీ పుత్రుడాయన. ఆయనకు ఒక సారి కుష్ఠరోగం వచ్చింది. ఆ కుష్ఠరోగం నుంచి బయటపడడానికి నారదుని సలహా మేర మకర సంక్రమణం రోజున మహాలక్ష్మిని పూజించాడు.పూజించిన తరువాత మూడు అరిటాకులు తీసుకుని వచ్చి అరిటాకులు మూడు విడివిడిగా పెట్టి దాని మీద బియ్యం కూరగాయలు ఉప్పు, పప్పు, మిరపకాయలు మొదలైనవన్నీ పెట్టాడు. ఆ మూడు ఆకుల మీద మూడు గుమ్మడికాయలు పెట్టాడు. ఆ మూడు ఆకులలోని స్వయంపాకం తో పాటు ఈ గుమ్మడికాయలను గర్గాచార్యునికి, దుర్వాసమహర్షికి, విశ్వామిత్రునికి దానం ఇచ్చాడు. ఆయనకు అదృష్టవశాత్తు యాదవకుల పురోహితుడైన గర్గుడు దొరికాడు,

విశ్వామిత్రుడుదొరికాడు, దుర్వాసుడు దొరికాడు. ఆ ముగ్గురికీ దానం చేయడంతోటే సాంబుడికి ఉన్న కుష్ఠరోగం తొలగిపోయి అందమైన శరీరం వచ్చింది. చర్మమంతా బాగుపడింది. భయంకరమైన శారీరిక రోగములను తొలగించే శక్తి మకర సంక్రమణం నాడు కుష్మాండదానమునకు ఉన్నది. గుమ్మడికాయ దానమునకు ఉన్నది. వీలుంటే ముగ్గురు పండితులకు ఇవ్వడం మంచిది. అలా ముగ్గురు పండితులు దొరకకపోయినా, శక్తి లేకపోయినా కనీసం ఒక్కరికైనా దానం చేయడం మంచిది.

6)మకర సంక్రమణం నాడు సూర్యాస్తమయం అయ్యాక భగవత్ కథ వినాలి. ఈరోజు భాగవతం వినండి లేదా బ్రహ్మవైవర్త పురాణం వినండి. మీ ఇష్ట దేవతలకు సంబంధించిన చరిత్రలు వినండి. ఈ రోజు పురాణం వింటే వాడు సకల దోషాలు నుంచి విముక్తిని పొందుతాడు మానవుడు తరించడానికి కలియుగంలో పురాణ శ్రవణానికి మించినది మరొకటి లేదు.

కృతాదౌ బహవో ధర్మాః

కలౌ ధర్మస్తు కేవలం

పురాణ శ్రవణాదన్యో

విద్యతే నాపరోన్నృణాం

కృతయుగంలో మానవుడు తరించడానికి చాలా ధర్మాలు ఉండేవి. కానీ కలియుగంలో అన్ని ధర్మాలు, దానాలు కష్టాలు పడక్కర్లేదు. కలియుగంలో మకరసంక్రమణం నాడు శ్రద్ధతో పురాణకథలు అరగంటో, పావుగంటో వింటే వాడు తక్షణం సకల పాపాల నుంచి విముక్తి పొందుతాడు. కేవలం పురాణశ్రవణం వలన మానవుడు తరిస్తాడు. ఈ సంక్రాంతినాడు విన్న పురాణం మరింత ఫలితం ఇస్తుంది. కాబట్టి సంక్రాంతి నాడు తప్పక పురాణ శ్రవణం చేయాలి. మంత్రోపదేశం చేసిన గురువులు లేక పౌరాణికులైన గురువులు కనబడితే తక్షణం వారి పాదాలను భక్తితో పట్టుకుని వాళ్ళ పాదాల కింద ఉన్న ధూళిని శిరస్సున వేసుకోవాలి. ఒక్క పౌరాణికుడుని పూజిస్తే త్రిమూర్తులను పూజించినట్లే. అందుకే అన్నింటికంటే ఉత్తమమైన స్థానం పౌరాణికుడిది. అందుకే కదా భాగవత ప్రారంభంలో 'పౌరాణికోత్తమ బ్రతుకును పుట్టె...' అని సూతుడిని ఋషులంతా భక్తితో ప్రార్థించారు. దీవించడం కాదు. మహాత్మా మా తపః శక్తికూడా ధారపోస్తున్నాము. నువ్వు ఎక్కువ కాలం జీవించి మాకు పురాణములు చెప్పి మమ్మల్ని తరింప చేయి అన్నారు. ఈ రోజు తప్పక పురాణం చెప్పేటటువంటి పురాణవేత్త ఎవరైనా ఉంటే, జ్ఞాని ఉంటే ఆయన కాళ్ళు పట్టుకోండి. ఆయన ఆశీర్వచనం తీసుకోండి.

**కనుమ:**

ఇక మూడవ రోజుకు కర్షక లక్ష్మీ దివసము అని పేరు. అదే మనము ఇవాళ కనుమ పండుగ అంటున్నాము. ఈ రోజున ప్రాచీన కాలంలో ముగ్గురు మనుషులు భూలోకానికి వచ్చి రైతులను అనుగ్రహించారు. అందులో ఒకాయన ధన్వంతరీ. ఈ ధన్వంతరి రైతులకు ఆరోగ్యం, పంటకి ఆరోగ్యం ఇచ్చాడు. ఇంక రెండో ఆయన సాక్షాత్తు హలధరుడు బలరాముడు. బలరాముడికి పూర్వ రహస్యం ఆదిశేష శరీరం అంటే బలరాముడు అనే పేరుతో పుట్టినాయన ఆదిశేషుడు. ఆదిశేషుడు రైతులంటే చాలా ఇష్టం కలిగినవాడు అందుకే బలరాముడిగా పుట్టి నాగలి ధరించి నాగలితో భూమిని దున్నాడు. యమునానదిని నాగలితో ఓ పక్కకు లాగి తద్వారా వ్యవసాయానికి ఎంతో సాయం చేసినవాడు. ఈరోజు ధన్వంతరి తర్వాత రెండో వ్యక్తి దేవతా అవతారాలలో ఒకడైన ఆదిశేషుడు కూడా భూలోక సంచారానికి వస్తాడు. ఇక మూడవది శాకంభరీ అనే పేరుతో అమ్మవారు ఈరోజు భూలోకానికి వస్తుంది. పూర్వం దుర్గముడనేటటువంటి ఒక పాపాత్ముడి కారణం వలన ప్రజలందరికీ కరువు వచ్చింది. ఆ కరువును తొలగించి ప్రజలందరికీ అన్నం పెట్టి కూరగాయలు ఇచ్చి, విత్తనములు ఇచ్చి అమ్మ వారు రక్షించింది. అప్పట్నుంచి అమ్మవారిని శాకంభరీ అని పిలిచారు. ఆ శాకంభరీ దేవి

కూడా కనుమ నాడు భూలోకానికి వస్తుంది .ఈ విధంగా ఆయుర్వేద వైద్యుడైన ధన్వంతరి, వ్యవసాయానికి సాయం చేసే ఆదిశేషుడు, విత్తనాలు మొదలైనవి ఇచ్చేటటువంటి అమ్మవారు శాకంభరీ, ఈ ముగ్గురు కనుమనాడు భూలోకానికి వచ్చి ప్రజలను అనుగ్రహిస్తారు. వాళ్ళ అనుగ్రహం మనం పొందితే ఏటికేడాది మనకు పంటలు బాగా ఉంటాయి. తిండికి ఎప్పుడూ కటకట ఉండదు. తిండి సమృద్ధిగా లభిస్తుంది. దానికి మనమేం చేయాలి

**కనుమ నాడు ఆచరించవలసిన విధులు:**

1)కనుమనాడు కూడా తెల్లవారుజామున లేచి తలారా స్నానం చేయాలి.

2)ఈ రోజు గోవులను, ఎద్దులను పూజించాలి. అసలు గోపూజ చేయడం కంటే ఈ ప్రపంచంలో మరొక గొప్ప పూజ లేదు. సమస్త దేవతలు గోవులలో ఉన్నారు "గవాం అంత్యేషు తిష్ఠంతి భువనాని చతుర్దశ" అని స్కాంద పురాణంలోని కాశీఖండం చెబుతున్నది. శివపురాణం చెబుతున్నది,దేవీ భాగవతం చెబుతున్నది. ఇంచుమించుగా ప్రతి పురాణం లో గోవు యొక్క ప్రసక్తి వస్తూనే ఉంటుంది. అందువలన కనుమనాడు ఆవులను, ఎద్దులను కూడా పూజించాలి. గోవృషభాలను రెండింటినీ పూజించాలి. గోవు భూమికి ప్రతీక. అందుకే భూదేవి ఎప్పుడూ గోవు రూపంలో ఉంటుంది అని భాగవతంలో ఉన్నది. ధర్మ దేవత ఆబోతు రూపంలో ఉంటుంది. అంటే ఎద్దు రూపంలో మనం పూజించేది సాక్షాత్తూ ధర్మదేవతనే. కాబట్టి ధర్మదేవతకు ప్రతీక అయిన ఎద్దుని భూదేవికి ప్రతీక అయిన గోవుని ఈ రోజు పూజించాలి. పూజిస్తే ఏకకాలంలో ఇటు మొత్తం భూమిని పూజించిన పుణ్యం వస్తుంది. ఇటు ధర్మదేవతను పూజించిన పుణ్యం వస్తుంది. అసలు రైతులను పూర్వం రక్షించినవి ఇవే. ఇవాళ అంటే ట్రాక్టర్లు, మిషన్లు వచ్చాయి కానీ పూర్వకాలంలో వ్యవసాయానికి పశువులనే వాడేవారు. దాని వల్ల ఎంతో లాభం కూడా. పశువులు భూమిని దున్నితే, ఆ భూమి మీద ఉన్న పొరలు పైకి లేస్తాయి. మిషన్లతో దున్నితే ఆ మిషన్లు భూమిని అణచివేస్తాయి. పశువులు పొలంలో దున్నుతున్నప్పుడు పేడ వేసినా, మూత్రం విసర్జించినా ఈ ఆవుల నుంచి గేదెల నుంచి ఎద్దుల నుంచి వచ్చేటటువంటి పేడ, మూత్రము ఎరువవుతుంది. భూమిని కాపాడుతుంది. అదే మనం ట్రాక్టర్లతో దున్నితే ఈ పొల్యూషన్ వల్ల భూమి మీద ఉన్న పంట దెబ్బతింటుంది. అందుకే పూర్వకాలంలో యంత్రాలు కాకుండా జంతువులను ఉపయోగించేవారు. ఏ రకంగా చూసినా పూర్వం ఆవు, ఎద్దు రైతులను రక్షించేవి. అందుకే మమ్మల్ని రక్షించి భోజనం ప్రసాదించిన మిమ్మల్ని మేము ఈ కనుమ నాడు భక్తితో పూజిస్తాము. అని రైతులు ఈరోజు గోదేవతలను పూజిస్తారు. మనం కూడా అలాగే గోదేవతలను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి.

3) ఈ రోజు తప్పక మాషచక్రాలు అంటే మినప గారెలు తినాలి. మినుము శరీరానికి బలం ఇస్తుంది. ఎముకలకు పటుత్వాన్ని ఇస్తుంది. ఏలినాటి శని దోషాలను తొలగిస్తుంది. కనుమ నాడు మినుములను బాగా రుబ్బి ఈ మినప పిండి తోటిగారెలు వేసి ఈ గారెలను ఇష్టదేవతకు నివేదన చేసి కాలభైరవుని మెడలో కూడా వేసి ఆ తరువాత తాము తిని ఇతరులకు పంచిపెడితే ఆ రోజు నుంచి వారికి శని దోషం తొలగుతుంది. అందుకనే కనుమనాడు తప్పకుండా గారెలు తినండి అన్నారు. దోషాలలోకెల్లా శనిదోషం పెద్ద ప్రమాదకరమైనది. శనైశ్చరుడి యొక్క అనుగ్రహం కలగాలంటే కనుమ నాడు మాషచక్రాలని అంటే మినుములతో తయారుచేసిన గారెలను, అదికూడా నువ్వుల నూనెలో వేయించిన గారెలను భగవంతునికి నివేదన చేసి, కాలభైరవుని సమర్పించి, తాము తిని, ఇతరులకు పెట్టడం మంచిదని శాస్త్రం చెబుతున్నది.

4)ఈ రోజున వీలుంటే చెట్లను కూడా పూజించాలి. వృక్షదేవతలను పూజిస్తే కుటుంబం పచ్చగా ఉంటుంది. ఇంట్లో ఉన్నటువంటి వాళ్లకు మనశ్శాంతి లభిస్తుంది.

ఈ విధంగా భోగి, సంక్రాంతి, కనుమ అనే పేర్లతో మూడు పవిత్రమైన దివసాలను ఈ లోకానికి అందించి, ఈ మూడింటి ద్వారా మహాలక్ష్మి లోక శ్రేయస్సు కోసం సంపదలను అందిస్తున్నది. ఈ మూడు రోజులను వరుసగా ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అని పిలుస్తారు. ఇచ్ఛ అంటే సంకల్పం లేదా కోరిక. భోగి కోరికలకి నిలయమైనటువంటి లేక కోరికలను కనేటువంటి లేక పెంచుకునేటటువంటి రోజు. అంటే ముందు ఎవడన్నా ఒక పని చేయాలంటే ఒక కోరిక ఉండాలి కదా. నేను చదువుకోవాలి, నేను సంపాదించాలి, నేను జ్ఞానం పొందాలి, నేను గొప్పవాడిని అవ్వాలి ఈ సంకల్పమునకు ఇచ్ఛ అని పేరు ఇచ్ఛాశక్తి భోగినాడు మానవులకు లభిస్తుంది. కేవలం కోరిక ఉంటే లాభం లేదుగా, కోరికలు నెరవేర్చుకోవడానికి జ్ఞానం కావాలి, తెలివి కావాలి. ఈ జ్ఞానశక్తిని మానవులకిచ్చేటటువంటి పర్వదినం సంక్రాంతి. అందుకే సంక్రాంతిని జ్ఞానశక్తి అన్నారు. కోరిక ఉన్నది, ఆ కోరికను నెరవేర్చుకోవడానికి కావలసిన జ్ఞానం ఉన్నది, ఎవరైనా ఎంత తెలివితేటలున్నా, ఎన్ని కోరికలు ఉన్నా కష్టపడి శ్రమించిపనిచేస్తేనే వాడు అనుకున్నటువంటి పనిలో విజయం పొందుతాడు, ఆ పని చేసేటటువంటి పర్వదినమే మూడవ రోజయిన కనుమ. అందుకే కనుమకు క్రియాశక్తి అని పేరు. ఈ త్రిశక్తి స్వరూపాలే ఈ పండుగలు. ఈ త్రిశక్తి రూపాల్లో జగదాంబ లోక సంచారం చేసి మానవుని రక్షిస్తున్నది. ఇది కృతయుగం కాలంలో స్వాయంభువమనువు కాలంలో ప్రారంభమైన అపూర్వమైనటువంటి పండుగ అన్నమాట. అంటే మనం ఈ భోగి సంక్రాంతి కనుమ అని భావిస్తున్న మూడు రోజుల పండుగ ఇవాళ ఆరంభమైనది కాదు. మనువులలో మొదటి మనువు స్వాయంభువు మనువు. ఆ మనువు కాలంలో ఈ పండుగ ఏర్పాటయింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఎంత మంది మనువులు మారుతున్నా ఎంత కాలం మారుతున్నా మనం ఆ పండుగను అలాగే చేసుకుంటున్నాం. ఈ పండుగను తప్పక చేసుకోవాలి. ఈ పండుగ మూడు రోజులు కొత్త వస్త్రాలు ధరించాలని శాస్త్రం చెబుతున్నది. దారిద్ర్యం ఉంటే అది పక్కన పెట్టండి. ఆ దారిద్ర్యం ఎలాగో ఈ పండుగలను చేసుకుంటే తొలగుతుంది. దారిద్ర్యమే కనుక లేకపోతే కొత్త బట్టలు ధరించండి. తాము ధరించలేకపోయినా కష్టపడి కొత్త వస్త్రాలు కొని ఇతరులకు దానం చేయటం మంచిది. ధరించుట కంటే దానం చేయటం మంచిది. అందుకే పూర్వకాలంలో కుచేలుడు (మనం కుచేలోపాఖ్యానం అని చెప్పుకుంటున్న కథ గర్గ సంహితలో ఉంటుంది) మకర సంక్రమణం నాడు తన దగ్గర బట్టలు లేకపోయినా యాచన చేసి తీసుకు వచ్చి ఇతరులకు ఇచ్చాడట. నిజానికి కుచేలుడు ఎప్పుడూ ఎవరి దగ్గరికి వెళ్ళి చేయిచాచి అడుగడు. అయితే పరోపకారం కోసం, పరులకు దానం చేయడం కోసం, యాచన చేయడం కూడా చాలా మంచిదట. అందుకేగా ఇంట్లో ఏమీ లేకపోయినా కుచేలుడి భార్య కుచేలుడు కృష్ణుడు దగ్గరికి వెళుతున్నప్పుడు నాలుగు గుప్పెళ్ళు, నాలుగు పిడికిళ్ళు అటుకులు యాచించి తీసుకుని వచ్చిందట. ఎప్పుడూ ఎవరినీ అడుగని కుచేలుడు ఎందుకు అడిగాడు అంటే ఇతరులకు ఇవ్వడం కోసం మంచి పనులు చేయడం కోసం లోక శ్రేయస్సు కోసం యాచన చేయడం కూడా మంచి పుణ్యకార్యక్రమం క్రిందే లెక్క. ఈ రోజు తమకు లేకపోయినా, తాము కట్టుకోవడానికి వీలు లేకపోయినా, బట్టలు అయినా పట్టుకుని వచ్చి ఇతరులకు దానం చేయండి అన్నారు. ఈ రోజు ఈ మూడు రోజులు వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ రోజులలో దేవాలయ సందర్శనం తప్పక చేయాలట. కాళ్ళుచేతులు పని చెయ్యని వాడు కూడా ఇతరుల చేత మోయించుకుని అయినా దేవాలయ సందర్శనం చేయడం మంచిది అని చెప్పారంటే, ఆయువు ఉండి, ఆరోగ్యం ఉండి ఆలయానికి వెళ్ళి దైవ సందర్శనం చేయకపోతే ఎంత దురదృష్టవంతులో చూడండి. తప్పక దేవాలయానికి వెళ్ళాలి. అక్కడ భగవంతుని శక్తి కేంద్రీకరింపబడి ఉంటుంది కనుక. పూర్వకాలంలో ధర్మవ్యాధుడు అనే ఒక ఆయన ఉండేవాడు. ఆయన ఎక్కడ ఉన్నా ఈ మూడు రోజులు మాత్రం తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి తల్లిదండ్రులకు కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిమీద జల్లుకుని పూజించేవాడు కాబట్టి మూడు రోజులు మాతాపితల

యొక్క పూజ చేయండి. తల్లిదండ్రులు లేని వాళ్లు గురువులను పూజించండి. ఎవరూ లేకపోతే కనీసం వాళ్ళ పటాలనైనా పూజించాలని శాస్త్రం లో చెప్పారు ఈ కార్యక్రమాలు చేసి ఈ త్రిదివస పర్వదినాన్ని సద్వినియోగం చేసుకోండి.

******

## శ్రీ ప్రణవపీఠ సత్సంగ సమాచారం

### విద్యానిధి కార్యక్రమం

సమాజంలో అందరూ తమకు అన్నీ తెలుసు అనుకుంటారు. మనకు ఏమి తెలుసు అన్న ప్రశ్న మనల్ని మనం వేసుకున్నప్పుడు అంతా శూన్యమే కనబడుతుంది. అటువంటి శూన్యం నుండి కాంతిరేఖలు వెలువడాలి అంటే జ్ఞాన భాండాగారాన్ని మన బుద్ధితో నిర్మించుకోవలసిందే. మన బుద్ధికుశలతతోనే వికసింపచేసుకోవాలి. మానవులకు మాత్రమే ఉన్న అద్భుత అవకాశం ఇది. అటువంటి ప్రయత్నమే శ్రీ ప్రణవపీఠం నిర్వహిస్తున్న విద్యానిధి కార్యక్రమం. మారుతున్న కాలాన్ని అనుసరించి సాంకేతికతను జోడించి శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం విద్యానిధి కార్యక్రమములను నిర్వహిస్తోంది. పిల్లల కోసం **జ్ఞానమాధుర్యము, కథామృతం, వేదగణితం** వంటి కార్యక్రమములు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలు మానవతా విలువలు రుచి చూపించి విద్యార్థుల బుద్ధిని వికసింప చేసే కార్యక్రమాలు.

**జ్ఞాన మాధుర్యం** : ఇందులో తెలుగు పద్యాలు నేర్పుతూ జ్ఞానవికాసానికి నాంది పలుకుతున్నారు. అమ్మ లాలి పాటలు, అమ్మమ్మ, బామ్మలు చెప్పే కథలు, తామరపువ్వు లాంటి తాతగార్ల ఒడిలో కూర్చుని వినే కథలు పిల్లల మనోవికాసానికి పదును పెడతాయి. కానీ ఈనాడు ఆ పరిస్థితి కనుమరుగయ్యింది. నాగరికత పేరుతో సమాజంలో వస్తున్న వింతమార్పులను గమనిస్తూ అగాధంలో పడిపోకుండా ఒక గాడిన పెట్టడానికి శ్రీ ప్రణవ పీఠం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా నిర్వహించినదే **కథామృత కార్యక్రమం.** జ్ఞానం తో పాటు మనోవికాసము కుడా ఈ కార్యక్రమం ద్వారా కలుగుతుంది. పురాతన భారతీయులు గణిత సూత్రాలను నేటి తరం పిల్లలకు అందించే కార్యక్రమం **వేదగణితం.** ఈ మూడు కార్యక్రమములను తొలి విడతగా 3 నెలలు నిర్వహించి విజయవంతముగా పూర్తి చేసింది శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం.

పూజ్య గురువులు అందించిన 'మా'నవ కథ , శ్రీ వేంకటేశ్వర విలాసం, శ్రీ మద్దేవీభాగవతం వంటి దివ్య గ్రంథముల కొఱకు, పూజ్య గురుదేవుల ప్రవచనముల కొఱకు, అంతర్జాతీయ అంతర్జాల పోటీల కొఱకు వెబ్సైటును సందర్శించండి.

https://srivaddipartipadmakar.org/

## శ్రీ ప్రణవపీఠం వార్షికోత్సవముల సందర్భంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతర్జాల పోటీలు

### చిత్రలేఖనం పోటీలు

మనసులో రూపుదిద్దుకున్న భావాలకు ప్రతిరూపం చిత్రలేఖనం. అది ప్రకృతి అయినా, దైవమైన గురు రూపమైనా చక్కటి ఆకృతిని ఇవ్వగలిగేది చిత్రలేఖనం మాత్రమే. లలిత కళల్లో ఒకటైన **చిత్రలేఖనం పోటీలు** నిర్వహిస్తున్న శ్రీ ప్రణవ పీఠం భారతీయ కళలకు జీవం పోస్తుంది. పిల్లల నుండి పెద్దల వరకూ వారి నైపుణ్యతను వెలికితీసే మహత్తర కార్యక్రమం ఇది.

### సాహితీపోటీలు

తెలుగు భాషను చిన్నచూపు చూస్తున్న ప్రస్తుత యువతకు తెలుగు పట్ల అవగాహన పెంపొందిచటానికి శ్రీ ప్రణవపీఠం చేస్తున్న చిరు ప్రయత్నం మన తెలుగు – జగతికి వెలుగు కార్యక్రమం. ఈ కార్యక్రమంలో భాగంగా వేస్తున్న మొదటి అడుగు **సాహితీపోటీలు**. ఈ పోటీలలో ఇవ్వబడిన మూడు అంశాల నుండి ప్రతి అంశానికి ఒకొక్క వ్యాసము వ్రాయాలి, అనగా మొత్తం 3 వ్యాసాలు వ్రాసి సమర్పించాలి.







******